## కమ్మ సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి

### కమ్మ కార్తిక వనభోజనోత్సవాల్లో ఎమ్మెల్యేలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చర్లపల్లి/ఉప్పల్, నవంబర్ 24: కమ్మ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, శేరి లింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో కాప్రా కాకతీయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్మ కార్తిక మాస వనభోజనోత్సవాలకు మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్, ఏపీ టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి, పారిశ్రామికవేత్త మన్నే సుబ్రమణ్యం, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, టీజీకే మూర్తిలతో కలిసి వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు బ్రహ్మం, పోట్లూరి రామకృష్ణ, వాసు, మధు, పాపారావు, సాంబశివరావు, సాయి నాగర్జున, విశ్వేశ్వర్‌రావు, ప్రసాద్‌లతోపాటు పెద్ద సంఖ్యలో కమ్మ కులస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల

## రద్దుకు న్యాయ పోరాటం

### త్వరలో ఢిల్లీలో భారీ ధర్నా


సమావేశంలో అధ్యక్షుడు దాసు సురేశ్, వినోద్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి, నవంబర్ 24: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో అట్టడు వర్గాలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని పలువురు వక్తలు అన్నారు. బాగ్‌లింగంపల్లి బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయలో ఈడబ్ల్యూఎస్ రేజర్వేషన్ల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎదురవుతున్న తీవ్ర అన్యాయాన్ని ఎదుర్కోవడానికి చట్టపరమైన మార్గాలను అన్వేషించడానికి రాజ్యాంగ నిపుణులు, మేధావులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాధికార సమితి అధ్యక్షుడు బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ మాట్లాడుతూ.. ఈడబ్ల్యూఎస్ రద్దుకై న్యాయపోరాటం చేస్తామని, త్వరలో దీని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేస్తామన్నారు. అదే విధంగా త్వరలో ఢిల్లీలో భారీ ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ద్వారా డీఎస్సీ, గ్రూప్-4, యూపీఎస్సీ, ఐఐటీ, నీట్, టీచర్ ఎడ్యుకేషన్ తదితర విభాగాల్లో బీసీలకు, ఎస్సీ, ఎస్టీలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని తెలిపారు. లా కాలేజీ మాజీ డీన్ ప్రొఫెసర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో ఎస్సీ, ఎస్టీల కంటే బీసీలు అధికంగా నష్టపోతున్నారన్నారు. రాజ్యాధికార సమితి గ్రేటర్ అధ్యక్షురాలు బండారు పద్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బాగయ్య, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకులు కత్తుల కవిత, హైమావతి, మంజాల రాజేందర్ గౌడ్, కొమురయ్య, కుమారస్వామి యాదవ్, కిశోర్, వరపల్లి అనిల్, బండారు పద్మావతి, పరాసాని దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

## డార్విన్ సిద్ధాంతంపై విస్తృత ప్రచారం




సిటీబ్యూరో, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతంపై విస్తృత ప్రచారం చేయాలని జన విజ్ఞాన వేదిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో జీవపరిణామ సిద్ధాంత ప్రచారోద్యమాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు నిమ్స్ మాజీ డైరెక్టర్ డా.దాసరి ప్రసాద్‌రావు గోడ పత్రికను విడుదల చేశారు. దాచిపెడితే దాగని సత్యం జీవపరిణామం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. జేవీవీ కన్వీనర్ ప్రొ. రామచంద్రయ్య మాట్లాడుతూ.. నవంబర్ 24వ తేదీన ప్రపంచ జీవ పరిణామ దినోత్సవాన్ని ప్రపంచమంతా జరుపుకుంటున్నామన్నారు. జీవుల పుట్టుక, వాటి పరిణామంపై జనాలకు విస్తృతమైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చెలిమల రాజేశ్వర్ మాట్లాడుతూ.. మత ఆంక్షలను తట్టుకుని డార్విన్ సిద్ధాంతం నిలబడిందన్నారు. కార్యక్రమంలో సీసీఎంబీ రీసెర్చ్ స్కాలర్ ఆదిత్య, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా, నాయకులు వరప్రసాద్, పి.ఆనంద్‌కుమార్, జగన్మోహన్‌రావు, శ్రీనివాస్, రవీంద్రబాబు, కురువయ్య, లక్ష్మీనర్సయ్య, చాగంటి సాయి, రంగాచారి, రాములయ్య, ఆల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

### బెంగళూరులో వేడుకగా

## కెనరా బ్యాంక్ వార్షిక మారథాన్

బెంగళూరు, నవంబర్ 24: కెనరా బ్యాంక్ వార్షిక మారథాన్ బెంగుళూరు వీధులను ఫిట్‌నెస్, ఇంకా కమ్యూనిటీ స్పిరిట్ యొక్క ఉత్సాహభరితమైన వేడుకగా మార్చింది. ఈ సంవత్సరం 9000 వేల మంది ఉత్సాహవంతంగా పాల్గొనేలా ఈ ఉత్సవం ఆకర్షించినది. కాగా, ఈ కార్యక్రమం బెంగుళూరులోని కంఠీరవ స్టేడియంలో కెనరా బ్యాంక్ నిర్వాహకులు పతాకాన్ని ఆవిష్కరించగా ఆనందోత్సాహాల మధ్య ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణ రాజు, కెనరా బ్యాంక్ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ విజయ్ శ్రీరంగన్, కెనరా బ్యాంకుల అన్ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌తో సహా ప్రముఖులు హాజరయ్యారు. ఇంకా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, బెంగుళూరు, కెనరా బ్యాంక్ అసోసియేట్ భాగస్వాముల నుంచి సీనియర్ ప్రతినిధులు హాజరై ఈ కార్యక్రమానికి ప్రాముఖ్యత జోడించారు. అయితే, ఈ మారథాన్‌లో 10కే రన్‌లో అగ్ర స్థానంలో నిలిచిన స్త్రీ, పురుష విజేతలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల నగదు రివార్డులు, 5 కే రన్ విజేతలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష నగదు రివార్డులు అందించారు. అంతే కాకుండా రెండు ప్రధాన విభాగాలలో పోటీ పడినందున రన్నర్లు అద్భుతమైన సంకల్పం, ఇంకా అథ్లెటిసిజం ప్రదర్శించారు. 10కె, 5కె రన్ ప్రతి విభాగంలో మొత్తం ఆరుగురు విజేతలు వారి అసాధారణ పని తీరును ప్రదర్శించారు.



# వాయు కాలుష్యం.. ప్రమాదకరం

- నగరంలో పడిపోతున్న ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- సీపీసీబీ పరిమాణాన్ని దాటుతున్న కాలుష్య కారకాలు



సిటీబ్యూరో, నవంబర్ 24(నమస్తే తెలంగాణ: నగరంలో వాతావరణం ప్రమాదకరంగా మారుతున్నది. నిత్యం పెరుగుతున్న వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు గాలి నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నిర్ణీత పరిమాణాన్ని దాటిపోతున్నది. దీంతో కొన్ని ప్రాంతాల్లో పీల్చే గాలిలో పరిమితికి మించి కాలుష్య కారకాలు ఉన్నట్లుగా తేలింది. తాజాగా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నివేదిక ప్రకారం పరిశ్రమలు విస్తరించిన కూకట్‌పల్లి, మూసాపేట్, బాలానగర్‌తోపాటు వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే నాంపల్లి, మెహదీపట్నం వంటి ప్రాంతాల్లో గాలి కాలుష్య కారకాలు ప్రమాదకరంగా మారినట్లుగా తేలింది. ఆదివారం పలు ప్రాంతాల్లో నమోదైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా 300 దాటింది. ఢిల్లీకి సమానంగా గాలి కాలుష్యంలో హైదరాబాద్ దూసుకుపోతుందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. నగరంలో పరిస్థితి చేజారక ముందే నియంత్రణ చర్యలపై దృష్టి పెట్టాలని, కాలుష్య కారకాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. ముఖ్యంగా నగరంలో వాతావరణంలో పెరుగుతున్న దుమ్ము, ధూళి కణాల తీవ్రతను అధిగమించేలా పీసీబీ, బల్దియా చర్యలు తీసుకోవాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం, శాఖల వైఫల్యం నగరవాసుల పాలిట శాపంగా మారింది. ఈ క్రమంలో చిన్నారులు, వయోవృద్ధులు, శ్వాస కోశ వ్యాధులతో బాధపడేవారికి హైదరాబాద్ వాతావరణం ప్రమాదకరంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**కాలుష్య నగరాల జాబితాలో హైదరాబాద్...**

పెరుగుతున్న వాహనాల రద్దీ, మానవ తప్పిదాలు, కాలుష్య కారకాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్‌లో గాలి నాణ్యత పడిపోతున్నది. ఏటా పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా వాహనాలపై నియంత్రణ లేదు. ఏడాది కాలంలోనే కలుషిత నగరాల జాబితాలో నిలిచింది. తాజాగా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఆధారంగా రూపొందించిన నివేదిక ప్రకారం దేశంలోనే అత్యంత కలుషిత నగరాల జాబితాలో ఏడో స్థానంలో ఉందని వెల్లడైంది. మొదటి స్థానంలో ఢిల్లీ ఉండగా, నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉండే బెంగళూరు, చెన్నై నగరాలు హైదరాబాద్ కంటే మెరుగ్గా ఉన్నాయి. దీంతో గాలిలో దుమ్ము, ధూళి కణాల ప్రభావం భారీగా ఉన్నది. దీంతో ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ సూచిక దారుణంగా పడిపోతుంది.

**ఏడాదిలో ఎంత మార్పు...**

గ్రేటర్ పరిధిలో కాలుష్య నియంత్రణ మండలి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. వాహనాల నుంచి వెలువడే వ్యర్థాలు, కాలుష్య కారకాల పరిమాణం ఒక్క ఏడాదిలో భారీగా పెరిగింది. ప్రస్తుతం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 300పైనే ఉండగా, గతంలో సాధారణ రోజుల్లో 150 మేర ఉండేది. కానీ ప్రభుత్వం నగరంలో కాలుష్య నియంత్రణ మార్పులపై దృష్టి పెట్టకపోవడంతోనే.. పరిస్థితి దారుణంగా మారిందని పర్యావరణ సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే గతేడాదిలో గాలిలో పీఎం2.5 స్థాయి తో పోల్చితే ఈసారి నగరంలోని పలు ప్రాంతాల్లో మూడింతలు పెరిగినట్లుగా నివేదికలు చెబుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నగరంలో కాలుష్య నియంత్రణకు దృష్టి పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు. లేదంటే ఢిల్లీ లాంటి పరిస్థితులు నగరంలోనూ కనిపించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

**గతేడాది నవంబర్ నెలలో పీఎం2.5**

| నగరం | పీఎం2.5 లెవల్స్(మై.గ్రా/క్యూ) |
|---|---|
| ఢిల్లీ | 241 |
| భోపాల్ | 116 |
| ఛండిఘర్ | 83 |
| పుణే | 79 |
| కోల్‌కతా | 73 |
| ముంబై | 63 |
| గాంధీనగర్ | 56 |
| హైదరాబాద్ | 43 |
| బెంగుళూరు | 41 |
| చెన్నయ్ | 35 |

(నోట్ : గాలిలో పీఎం2.5 పరిమాణం 50లోపు ఉంటే శ్వాస తీసుకోవడానికి ఉత్తమైనది.)

# దొడ్డి కొమరయ్య త్యాగం వెలకట్టలేనిది


చందనచెరువు కట్టపై దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి


రూ.20లక్షలు అందజేస్తున్న మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి

- చందన చెరువు కట్టపై దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 24: తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమరయ్య అని, ఆయన త్యాగం వెలకట్టలేమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందనచెరువు కట్టపై మీర్‌పేట కుర్మ సంఘం అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఆదివారం మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. దొడ్డి కొమరయ్య త్యాగాలను కొనియాడుతూ కళాకారులు పాటలు పాడి అలరింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమరయ్య కనబర్చిన పోరాట పటిమను ఎప్పుడు మర్చిపోకూడదన్నారు. చందన చెరువు కట్టపై మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం మన అదృష్టం అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు పోరెట్టి పద్మ భాస్కర్ రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, సిద్దాల లాడ్స్ బీరప్ప, సిద్దాల మౌనిక శ్రీశైలం, సిద్దాల పద్మ అంజయ్య, అర్కల భూపాల్ రెడ్డి ఏనుగు అనిల్‌కుమార్, నవీన్ గౌడ్, బొక్క రాజేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు దీప్‌లాల్ చౌహాన్, అర్కల కామేశ్‌రెడ్డి, రాజ్‌కుమార్, సిద్దాల భరత్ తదితరులు ఉన్నారు.

**ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి**

ప్రతిఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకుంటే సమాజంలో మార్పు వస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఇటీవల అకాల మరణం చెందిన నరేశ్‌కుమార్ కుటుంబాన్ని ఆమె ఆదివారం పరామర్శించారు. అనంతరం మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఏఅండ్ ఎం టూవీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరుపున సమకూర్చిన రూ.20లక్షలను నరేశ్‌కుమార్ కుటుంబానికి ఎమ్మెల్యే చేతులమీదగా అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ.. ఆపదోలో ఉన్న వారిని ఆదుకున్న ఏఅండ్ ఎం టూవీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అర్కల భూపాల్ రెడ్డి, అర్కల కామేశ్ రెడ్డి, నాయకులు పోరెడ్డి భాస్కర్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నరేందర్ యాదవ్, సతీశ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## బాలికల చదువు కోసం అవగాహన వాక్

ఖైరతాబాద్, నవంబర్ 24: బాలికల చదువు ఆవశ్యకతను వివరిస్తూ చైల్డ్ రైట్స్ అండ్ యూ(క్రై) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'ఎంపవర్ హర్' పేరుతో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజా వద్ద అవగాహన వాక్ నిర్వహించారు. ఈ వాక్‌ను తెలంగాణ మహిళా శిశు సంక్షేమాభివృద్ధి శాఖ డైరెక్టర్ ఎ.నిర్మలకాంతి వెస్లీ, మిస్ ఇండియా-2020 మానస వారణాసి, నటి దివ్య శ్రీపాద, తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేశ్, క్రై సౌత్ ప్రోగ్రామ్స్ విభాగం జనరల్ మేనేజర్ పీటర్ సునీల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికా విద్య కోసం తమ శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. బాలికల చదువు ప్రాధాన్యతను వివరిస్తూ క్రై ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్రై వలంటీర్ సపోర్ట్ జనరల్ మేనేజర్ అనుపమ ముహూరి, పోనుగంటి కావ్య, వసంత, అఖిల, జోత్స్న పాల్గొన్నారు.


వాక్‌లో పాల్గొన్న మహిళలు, బాలికలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చెన్నయ్య, రాజు, ప్రవీణ్, విజయ్‌కుమార్ తదితరులు

## 1న మాలల సింహగర్జన

ఖైరతాబాద్, నవంబర్ 24: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు డిసెంబర్ 1వ తేదీన పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహగర్జన నిర్వహిస్తున్నామని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య అన్నారు. ఖైరతాబాద్‌లోని బాలపుర బస్తీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాలల సింహగర్జన పోస్టర్‌ను గ్రేటర్ చైర్మన్ రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తి ప్రవీణ్, గ్రేటర్ కోచైర్మన్ రావుల విజయ్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. వర్గీకరణ అనేది రాజ్యాంగ విరుద్ధమని, దళితులను వర్గాలుగా విడదీసి రాజకీయ లబ్ధిపొందాలన్నది కొన్ని పార్టీల కుతంత్ర అని అన్నారు. ఈ సింహగర్జనకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పంచాయతీ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.నర్సింగ్‌రావు, మాణిక్‌రావు, శ్రీనివాసరాజు, వినయ్, కల్యాణ్‌దాస్ పాల్గొన్నారు.

## వైభవంగా విశ్వనాథ సాహిత్య పీఠం ద్విదశాబ్ది ఉత్సవాలు


'పూర్ణత్వపు పొలిమేరలో' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మెట్రోరైల్ డైరెక్టర్ ఎన్‌వీఎస్‌రెడ్డి

అమీర్‌పేట్, నవంబర్ 24: విశ్వనాథ సాహిత్య పీఠం ద్విదశాబ్ది ఉత్సవం ఆదివారం అమీర్‌పేట్‌లోని సెస్ ఆడిటోరియంలో వైభవంగా జరిగింది. ఉదయం 11 గంటలకు జరిగే పుస్తక ప్రదర్శనకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆవుల మంజులత అధ్యక్షత వహించగా, విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ వెల్చాల కొండల్‌రావు పీఠం ఆశయాలను, లక్ష్యాలను వివరించారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో తమకు, కరీంనగర్‌లోని సాహితీవేత్తలకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. డాక్టర్ ఆవుల మంజులత మాట్లాడుతూ.. విశ్వనాథ సత్యనారాయణను తెలుగు సాహిత్యానికి దీప స్తంభం లాంటి వారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆచార్య సి.మృణాళిని అధ్యక్షతన విశ్వనాథ సత్యనారాయణ గారి రచనల్లో 'హాస్యరసం'పై అనే అంశంపై జరిగిన సదస్సులో విశ్వనాథుని 'ముద్దు వడ్డనలు' పుస్తకాన్ని ఏపీ పూర్వ ముఖ్యకార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. విశ్వనాథ రచనల్లో హాస్యరసం గురించి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార వెలదండ నిత్యానందరావు, ఓలేటి పార్వతీశం, విశ్వనాథుని మనువడు విశ్వనాథ సత్యనారాయణ ప్రసంగించారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సిరివెన్నెల సీతారామ శాస్త్రి వ్యక్తి్వ విశ్లేషణపై ఆయన సోదరుడు చెంబోలు శ్రీరామశాస్త్రి రచించిన 'పూర్ణత్వపు పొలిమేరలో' పుస్తకాన్ని మెట్రోరైల్ డైరెక్టర్ ఎన్‌వీఎస్‌రెడ్డి ఆవిష్కరించారు.



## రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..

### బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

నేరేడ్‌మెట్, నవంబర్ 24: తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే ప్రజా సంక్షేమం సాధ్యమైందని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు నెరవేరలేని హామీలు ఇచ్చి మోసం చేస్తుందన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఆదివారం మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. సానుకూలంగా స్పందించిన కేసీఆర్ రిజర్వాయర్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. అధినేతను కలిసిన వారిలో మేకల రాముయాదవ్ తదితరులు ఉన్నారు.



## పెట్ షో అదరహో..




హైదరాబాద్ క్యానీ క్లబ్ ఆధ్వర్యంలో కుక్కలు, పిల్లులు, సాధు జంతువుల ప్రేమికులకు సంబంధించి 'పెడిగ్రీ ప్రో. హైక్యాన్' 24 కార్యక్రమం నార్సింగిలోని ఓమ్ కన్వెన్షన్ కేంద్రంలో ఆదివారం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా అదనపు డీజీపీ మహేశ్ భగవత్ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది దక్షిణ భారత దేశంలోనే భారీ ప్రదర్శన. ఇందులో దేశ వ్యాప్తంగా అత్యుత్తమమైన జాతి కుక్కలు, పిల్లులు పాల్గొన్నాయి. 'కెన్నెల్ క్లబ్ ఆఫ్ ఇండియా' చాంపియన్ షిప్ శునకాల షో, ఇంకా 'ది ఇండియన్ క్యాట్ క్లబ్' మార్జాలాల ప్రదర్శన ఆద్యంతం ఆసక్తికరంగా కొనసాగింది. శునక, మార్జాల రాజాలకు పెండ్లి తంతు మాదిరి కాంపిటేషన్స్ ఈ వేదికపై బ్రహ్మాండంగా నిర్వహించారు. సాధు జంతువులైన కుక్కలు, పిల్లులకు ఆటలు, నృత్యాలు, పలు రకాల పోటీలు నిర్వహించారు.

## బీసీల సమస్యలు పరిష్కారానికి సమరభేరి


సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, వెంకటేశ్, నందగోపాల్ తదితరులు

కాచిగూడ,నవంబర్ 24: బీసీల సమస్యలు పరిష్కరించే వరకు తెలంగాణలోని గ్రామ గ్రామాన సమరభేరి కొనసాగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బీసీల ఉద్యామాన్ని నిర్మాణాత్మకంగా పటిష్టపర్చేందుకు ఈనెల 25వ తేదీన రవీంద్రభారతిలో బీసీల 18 డిమాండ్లపై తలపెట్టిన బీసీల సమరభేరి వాల్‌పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం బీసీ సంఘాలు, కుల సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కేంద్రం ఎస్సీ అట్రాసిటీలాగ బీసీ అట్రాసిటీని తీసుకురావాలని, రానున్న రోజుల్లో దేశంలో బీసీ విప్లవం తప్పదని వెల్లడించారు. బీసీల వాటాను కేటాయించడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి లక్షలాది మందితో వచ్చే నెలలో ఢిల్లీలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీలం వెంకటేశ్, నందగోపాల్, సుధాకర్, ఉదయ్, రఘుపతి, మోదీరాందేవ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గోస పట్టదా?

**ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సమావేశంలో వక్తలు**



అభివాదం చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఖైరతాబాద్, నవంబర్ 24 : చాలీ చాలనీ వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా జీవితాలను వెల్లదీస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ జేఏసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారికి సరైన వేతన వ్యవస్థ లేకుండా దళారుల వల్ల నష్టపోతున్నారన్నారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ద్వారా వేతనాలు అందించాలన్నారు. తద్వారా ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం పడదని, పైగా కమీషన్లతో పాటు జీఎస్టీ మిగులుతుందని, ప్రభుత్వానికి ఎలాంటి నష్టం ఉండదన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని అసెంబ్లీ సమావేశాల్లోగానే ప్రకటించాలని, లేని పక్షంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఎఐటీయుసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహా మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ గైడ్‌లైన్స్‌లోనే సదరు ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగితో సమానంగా వేతనాలు ఇవ్వాలని ఉన్నా ఎవరూ పాటించడం లేదన్నారు. సుప్రీం కోర్టు సైతం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సూచించిందని, ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కనీసం లేబర్ డిపార్ట్‌మెంట్ స్పందించడం లేదని, జీహెచ్‌ఎంసీలో ఏజెన్సీ లేకుండా వేతనాలు ఇస్తున్నారని, అది అన్ని శాఖలకు అమలు చేయాలన్నారు. దళారి వ్యవస్థను తొలగించాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వై. శ్రీనివాస్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ పాఠశాలల పరిధిలో 16 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నామని, గ్రూప్-4 నోటిఫికేషన్ వల్ల 400 కుటుంబాలు వీధిన పడుతాయన్నారు. వారందరికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగ జేఏసి అధ్యక్షులు పులి లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో శ్రమదోపిడికి గురవుతూ పర్మినెంట్ ఉద్యోగులతో సమానం సేవలందిస్తున్నామన్నారు. ప్రభుత్వానికి, ఉద్యోగులకు మధ్య ఏజెన్సీలు లక్షలాది రూపాలు వెనకేసుకుంటున్నాయని తెలిపారు. తక్షణమే ఈ వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వమే నేరుగా తమకు వేతనాలు అందించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోనే నిర్ణయం తీసుకోవాలని లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు.